ఆర్థిక రాజధానిగా విశాఖ
ప్రపంచ డేటా హబ్‌గా అభివృద్ధి చేస్తాం
మెట్రో రైలు ప్రాజెక్టును కూడా పట్టాలెక్కిస్తాం
పెట్టుబడులు పెట్టేందుకు అనేకమంది ఆసక్తి
ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్
- వార్త 7వ పేజీలో..

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందాం

ఉమ్మడి జిల్లా కూటమి ప్రజా ప్రతినిధులతో మంత్రి నారా లోకేశ్ భేటీ

- స్టీల్‌ప్లాంటు అంశంపైనే ప్రధానంగా చర్చ
- సెయిల్‌లో విలీనం చేస్తే బాగుంటుందన్న కొందరు ఎమ్మెల్యేలు
- కేంద్రంతో వీలైనంత త్వరగా చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరిన పలువురు నేతలు
- కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రశ్నే ఉత్పన్నం కాదన్న యువనేత
- కార్మికుల కళ్లలో ఆనందం చూడాలనే దృఢ సంకల్పంతో కేంద్రంతో సంప్రతింపులు జరుపుతున్నట్టు వెల్లడి



రుషికొండలోని రాడిసిన్ బ్లూ హోటల్‌లో బుధవారం సాయంత్రం ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజాప్రతినిధులతో సమావేశమైన మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందామంటూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన కూటమి ప్రజా ప్రతినిధులు తీర్మానించారు. కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. బుధవారం సాయంత్రం రుషికొండలోని రాడిసిన్ బ్లూ హోటల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన కూటమి ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా విశాఖ ఉక్కు కర్మాగారం అంశంపైనే చర్చ జరిగింది. అందరూ తమ తమ అభిప్రాయాలు వ్యక్తపరచారు. ప్రస్తుతం కర్మాగారంలో ఒక్కొక్క యూనిట్‌ను మూసివేస్తున్నారని, ఉద్యోగులను డిప్యుటేషన్‌పై బయటకు పంపుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇటువంటి పరిస్థితుల్లో కర్మాగారాన్ని కాపాడుకునేందుకు కేంద్రంతో చర్చించాలని కోరారు. ఇప్పుడున్న సంక్షోభం నుంచి బయటపడి కర్మాగారం సజావుగా నడవాలంటే ఉక్కు దిగ్గజం సెయిల్‌లో విలీనం చేయడం ఒక్కటే మార్గమని కొందరు అభిప్రాయపడ్డారు. 32 మంది బలిదానంతో ఏర్పడిన కర్మాగారం ఆంధ్రుల సెంటిమెంట్‌కు సంబంధించిందని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ స్టీల్‌ప్లాంటును కాపాడుకోవాలని ఉద్దేశంతో ఉన్నారన్నారు.

సెయిల్‌తో సంబంధం లేకుండా కేంద్రం నుంచి భారీగా రుణం తీసుకుని కర్మాగారాన్ని నడిపితే ఎలా ఉంటుందని కొందరు ప్రస్తావించగా మరికొందరు పలు సందేహాలు వ్యక్తంచేశారు. కేంద్రం ... మిగతా 8వ పేజీలో

నేడు అప్పన్నను దర్శించుకోనున్న లోకేశ్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ గురువారం ఉదయం ఆరున్నర గంటలకు సింహాచలం వరాహనరసింహస్వామి దేవాలయానికి వెళ్లి స్వామిని దర్శించుకుంటారు. ఆ తరువాత ఉదయం తొమ్మిది గంటల నుంచి పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలను కలుసుకుంటారు. వీలునుబట్టి కార్యకర్తలతో సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. తరువాత నగరంలో మునిసిపల్ పాఠశాలలను సందర్శిస్తారు. అయితే దీనికి సంబంధించి ఎటువంటి సమాచారం బయటకు చెప్పలేదు. జిల్లా విద్యాశాఖకు కూడా సమాచారం ఇవ్వలేదు. నగరంలో పాఠశాలల వివరాలు ఇప్పటికే సేకరించిన లోకేశ్, ఆకస్మికంగా ఒకటి, రెండు పాఠశాలలను సందర్శించవచ్చునంటున్నారు.

ఏజెన్సీకి రావాలంటే వెనకడుగు

బదిలీపై వచ్చేందుకు తహసీల్దార్ల విముఖం

విశాఖపట్నం, పరిసర ప్రాంతాల్లో పని చేసేందుకు ఉత్సాహం

- జిల్లాలో కొలిక్కిరాని బదిలీల వ్యవహారం

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీలో పని చేసేందుకు తహసీల్దార్లు ముందుకు రావడం లేదు. కానీ ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు మాత్రం ఉత్సాహం చూపుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో జిల్లాలోని తహసీల్దార్ల బదిలీ వ్యవహారం నేటికీ ఒక కొలిక్కిరాని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని పది మంది తహసీల్దార్లు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లగా, పది మంది ఇతర ప్రాంతాల నుంచి ఆయా డివిజన్లకు వచ్చారు. అక్కడ నిబంధనల ప్రకారం బదిలీ ప్రక్రియను చేపట్టారు. కానీ పాడేరు రెవెన్యూ డివిజన్ విషయంలో అందుకు భిన్నమైన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడి నుంచి పది మంది ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళితే ఒక్కరు కూడా ఇక్కడికి రాలేదు. విశాఖపట్నం కలెక్టర్, అల్లూరి జిల్లా కలెక్టర్ మధ్య సరైన సఖ్యత లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందనే వాదన బలంగా వినిపిస్తున్నది.

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకే మొగ్గు

తాజాగా జరిగిన బదిలీల్లో వివిధ జిల్లాల నుంచి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు పలువురు తహసీల్దార్లు వచ్చారు. అయితే విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పని చేసేందుకు మొగ్గు చూపుతుండగా, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పని చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు. తాజా బదిలీల్లో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చేందుకు ముగ్గురు తహసీల్దార్లు తొలుత ఆసక్తి చూపినప్పటికీ, ఆ తరువాత ముందుకు రాలేదు. దీంతో ఇప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లో పని చేసేందుకు ఒక్క తహసీల్దార్ కూడా ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో ఇక్కడ తహసీల్దార్ల బదిలీ ప్రక్రియ ఓ కొలిక్కిరాలేదు.

బదిలీలపై ఎన్నికల తరువాత నుంచి అడ్డంకులే..

సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి బదిలీ చేసిన తహసీల్దార్లు, ఎన్నికల అనంతరం తమ సొంత జిల్లాలకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఇతర జిల్లాలో పని చేసిన అల్లూరి జిల్లాకు చెందిన తహసీల్దార్ల రాకపై ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రభావంతో అడ్డంకులు ఏర్పడ్డాయి. తరువాత ఎన్నికల కోడ్ ముగియడంతో తహసీల్దార్లను సర్దుబాటు చేశారు. తరువాత బదిలీల ప్రక్రియలో భాగంగా ఇక్కడ పని చేస్తున్న వాళ్లు మైదాన ప్రాంతాలకు వెళుతుండగా, అక్కడ నుంచి ఏజెన్సీకి ఎవరూ రావడం లేదు. ఎక్కువ మంది తహసీల్దార్లు పైరవీలు సాగిస్తూ విశాఖపట్నం సిటీ, పరిసర ప్రాంతాల్లోనే ఎక్కువ కాలం పని చేస్తున్నారు. వాస్తవానికి ఉన్నతాధికారులు దృష్టి సారించి గిరిజన ప్రాంతంలో పని చేయని తహసీల్దార్లను గుర్తించి వారిని మన్యానికి బదిలీలు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ వర్గాలు భావిస్తున్నాయి. సంఘాలు, రాజకీయ పైరవీలతో అనేక మంది తహసీల్దార్లు కేవలం విశాఖపట్నం చుట్టుపక్కల మాత్రమే పని చేసేందుకు ఉత్సాహం చూపుతుండడంతో గిరిజన ప్రాంతానికి ఎవరూ రావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏజెన్సీ ప్రాంతంలో మెరుగైన రెవెన్యూ సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



జిల్లా కలెక్టర్ కార్యాలయం

గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు | సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ -వార్త 8వ పేజీలో..



టేకు తోటల్లో పంప్డ్ స్టోరేజీ సర్వే రాళ్లను పరిశీలిస్తున్న అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్‌రెడ్డి

త్వరలో సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు అటవీ అనుమతులు

- ఇప్పటికే సర్వేలు పూర్తి
- విశాఖపట్నం సర్కిల్ పరిధిలో పలు చోట్ల ఎకో టూరిజం అభివృద్ధి
- అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్‌రెడ్డి

సీలేరు, సెప్టెంబరు 25: సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు స్థాపనకు అవసరమైన అటవీ అనుమతులు చివరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే ఈ ప్రాజెక్టుకు అటవీ అనుమతులు మంజూరుకానున్నాయని అటవీశాఖ విశాఖపట్నం సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం సీలేరులో కొత్తగా నిర్మించబోయే 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీకి సంబంధించిన అటవీ అనుమతులపై రిజర్వు ఫారెస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక అటవీశాఖ డిపోలో విలేకరులతో మాట్లాడుతూ సీలేరులో 1350 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించే పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు పూర్తిగా పర్యావరణ అనుకూలమైన ప్రాజెక్టు అని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే డీజీపీఎస్ సర్వే, డీమార్కేషన్(సరిహద్దుల గుర్తింపు), ఎస్సెస్‌మెంట్ (అంచనా) సర్వేలు పూర్తయ్యాయన్నారు. ఈ ప్రాజెక్టు కోసం జెన్‌కోకు 193 హెక్టార్ల అటవీ భూమి కావలసి ఉందని, ఇది నాలుగు బిట్లుగా ఉందని సర్వేలో పేర్కొన్నారని సీసీఎఫ్ తెలిపారు. డీజీపీఎస్ సర్వేలో పేర్కొన్న డీమార్కేషన్, ఎస్సెస్‌మెంట్ కరెక్టుగా ఉన్నాయా?, లేదా అని తాను పరిశీలించి ఆ నివేదికను పీసీసీఎఫ్‌కు అందజేస్తామని, దీనిపై రాష్ట్ర స్థాయి నుంచి ఒక అధికారి వచ్చి మరోసారి ఈ ప్రాజెక్టును పరిశీలించి నివేదికను కేంద్ర అటవీ అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తారని తెలిపారు. అక్కడితో ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి నుంచి కేంద్ర ప్రభుత్వానికి చేరుతుందన్నారు. చివరిగా కేంద్ర ప్రభుత్వం నుంచి అటవీ అనుమతులు పొందడానికి అవసరమైన సమాచారం అంతా నివేదికలో పూర్తి స్థాయిలో పొందుపరిచామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని త్వరలోనే పట్టాలెక్కించేందుకు చర్యలు వేగవంతం చేస్తోందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీఎస్ సర్వేలో పేర్కొన్న శాండికోరి, పార్వతీనగర్, జొన్నమామిడి, చర్ర్ప వెనుక భాగంలో వేసిన సర్వే రాళ్లను జెన్‌కో అధికారులతో కలిసి పరిశీలించారు.

పలు చోట్ల ఎకో టూరిజం అభివృద్ధి

విశాఖపట్నం సర్కిల్‌లోని ఐదు జిల్లాల పరిధిలో పలు చోట్ల ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టామని సీసీఎఫ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అరకు ఫారెస్టు కాంప్లెక్సు, అరకు పైనరీ ఇప్పటికే వినియోగంలోకి వచ్చాయన్నారు. చింతపల్లి డివిజన్ పరిధిలోని లంబసింగి కృష్ణాపురం వద్ద ఎకో టూరిజం ప్రాజెక్టు ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. అలాగే పార్వతీపురంలో సున్నపుగెడ్డ జలపాతం వద్ద ఎకో టూరిజాన్ని తయారు చేశామని, విజయనగరంలో సారిపల్లి, బేతనపల్లి వద్ద ప్రస్తుతం వినియోగంలోకి వచ్చాయన్నారు. విజయనగరానికి ... మిగతా 8వ పేజీలో





పారా గ్లైడింగ్ ట్రయల్ రన్

అరకులోయ, సెప్టెంబరు 25: అరకు సమీపంలోని జైపూర్ జంక్షన్ వద్ద బుధవారం పారా గ్లైడింగ్ ట్రయల్ రన్ నిర్వహించారు. ఐటీడీఏ పీవో అభిషేక్ స్వయంగా ఇందులో పాల్గొని పారా గ్లైడింగ్‌లో కాసేపు విహరించారు. ఇదే తరహాలో మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్, అలాగే ఎంపిక చేసిన పలు ప్రాంతాల్లో పారా గ్లైడింగ్‌కు ఏ మేరకు అవకాశాలు ఉన్నాయో పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ పారా గ్లైడింగ్‌కు సురక్షిత ప్రాంతాలను గుర్తించి పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు.

పారా గ్లైడింగ్ విన్యాసం. (ఇన్‌సెట్లో) పారా గ్లైడింగ్ ట్రయల్ రన్‌లో పాల్గొన్న ఐటీడీఏ పీవో అభిషేక్



అధికారులతో సమావేశమైన కలెక్టర్ దినేశ్‌కుమార్

చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు చర్యలు

- కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్
- గ్రామీణ పరిశ్రమ పార్కు ఏర్పాటుకు ఆదేశం

పాడేరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పరిశ్రమల శాఖ, వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ, పశు సంవర్థక శాఖ, నైపుణ్యాభివృద్ధి సంస్థల అధికారులతో పరిశ్రమల ఏర్పాటుపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ఉత్పత్తులతో గ్రామీణ చిన్నతరహా పరిశ్రమల పార్కు ఏర్పాటు చేయడానికి సమగ్రమైన సర్వే చేపట్టాలన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పడానికి గల అవకాశాలపై చర్చించారు. ఐటీడీఏ పీవో నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని, దాని ద్వారా చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.

గిరిజన ప్రాంతంలో కాఫీ, మిరియాలు, పైనాపిల్, సీతా ఫలాలు, అల్లం, పసుపు, చింతపండు, క్యాబేజీ, టమాటాలను ఎక్కువగా రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. చింతపల్లి మండలం గొందిపాకలు ప్రాంతంలో అందుకు సంబంధించిన పరిశ్రమ నెలకొల్పితే గిరిజనులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ముందుగా చింతపల్లి మండలంలోనే ఏర్పాటు చేయడానికి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ... మిగతా 8వ పేజీలో

ఇటొస్తే ఇరుక్కుపోయినట్టే..

బురదమయంగా చోడిరాయి వంతెన అప్రోచ్ రోడ్డు



చోడిరాయి వంతెన వద్ద బురదలో కూరుకుపోయిన ఆటోను నెడుతున్న దృశ్యం

సీలేరు, సెప్టెంబరు 25: జీకే వీధి మండలం ధారకొండ గుమ్మిరేవుల పంచాయతీలో ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిన చోడిరాయి వంతెన అప్రోచ్ వద్ద గ్రావెల్‌కు బదులు పక్కనే ఉన్న ఎర్ర మట్టిని వేసి రాకపోకలను పునరుద్ధరించారు. అయితే ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో ఆ మట్టిలో వాహనాలు కూరుకుపోతున్నాయి. బుధవారం ధారకొండ నుంచి గుమ్మిరేవుల వెళుతున్న ఓ ఆటో ఇలాగే బురదలో కూరుకుపోయింది. దానిని బయటకు తీసుకురావడానికి స్థానికులు చాలా కష్టాలు పడ్డారు. ద్విచక్ర వాహనచోదకులు కూడా ఇటుగా వచ్చి అవస్థలు పడ్డారు. ఈ మార్గంలో మాదిమళ్ల వంతెన వద్ద కూడా ఇదే పరిస్థితి ఉందని వాహనచోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ వంతెనల వద్ద వెట్‌మిక్స్ లేదా గ్రావెల్‌ను వేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని గిరిజనులు కోరుతున్నారు.

ఆర్థిక రాజధానిగా విశాఖ

- ప్రపంచ డేటా హబ్‌గా అభివృద్ధి చేస్తాం
- 15 రోజుల్లో అంతర్జాతీయ కార్గో రవాణా ప్రారంభం
- మెట్రో రైలు ప్రాజెక్టును కూడా పట్టాలెక్కిస్తాం
- పెట్టుబడులు పెట్టేందుకు అనేకమంది ఆసక్తి
- చర్చలు జరుపుతున్నాం...త్వరలోనే ఫలితాలు వెల్లడిస్తాం
- ఐటీ కంపెనీల బకాయిలు క్లియర్ చేస్తాం
- ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్



ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఐఐ ప్రతినిధి డాక్టర్ మురళీకృష్ణ. పక్కన మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఎంపీ ఎం.శ్రీభరత్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా మారుతుందని, మూడు ట్రిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందని ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సీఐఐ నోవాటెల్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. పారిశ్రామికవేత్తలు పారిపోయే పరిస్థితి తెచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. పరిస్థితులను చక్కదిద్ది మళ్లీ అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు యత్నిస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి వంటి సైకోలు సీఎంలు అయితే ఏమి జరుగుతుందో ప్రజలు తెలుసుకున్నారు కాబట్టి ఇకపై జాగ్రత్తగా ఉండాలన్నారు. విశాఖ నుంచి విదేశాలకు విమానాల ద్వారా సరకు పంపించుకునే సౌలభ్యం ఉండేదని, జగన్ హయాంలో అది కూడా పోయిందన్నారు. పదిహేను రోజుల్లో సరకు రవాణాకు చర్యలు చేపడతామన్నారు. విశాఖను ప్రపంచానికే డేటా హబ్‌గా మారుస్తామన్నారు. విశాఖపట్నం ఇప్పటికే ఐటీ డెస్టినేషన్‌గా మారిందని, ఫార్మా హబ్‌గా ఉందని, పెట్రో కెమికల్ కారిడార్ కూడా ఉందని, మరో వైపు నేవీ ఉందని, త్వరలో భోగాపురం విమానాశ్రయం కూడా అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతం రూపురేఖలే మారిపోతాయన్నారు. విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టును కూడా పట్టాల పైకి తెస్తామన్నారు. పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఉన్నందున డెడికేటెడ్ కారిడార్ ఉండాలని, దానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్తులో తక్కువ ధరకే విద్యుత్ లభిస్తుందని, అప్పుడు ఇక్కడికి రావడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతారన్నారు. విశాఖలో పెట్టుబడులకు అనేక మంది ఆసక్తిగా ఉన్నారని, కొంతమంది పారిశ్రామికవేత్తలు కూడా వచ్చారని, వారితో కలిసి క్షేత్ర పరిశీలన చేస్తామన్నారు. అనేక మందితో చర్చలు జరుపుతున్నామని, వాటి ఫలితాలు ఏమిటో త్వరలో వెల్లడిస్తామన్నారు. వంద రోజుల్లో ఐటీ పాలసీ ప్రకటిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ఐటీ కంపెనీలకు ఒక్క రూపాయి కూడా రాయితీ ఇవ్వలేదని, ఆ బకాయిలన్నీ త్వరలో క్లియర్ చేస్తామని చెప్పారు.

ఎలివేటెడ్ కారిడార్‌తో ఫ్లైఓవర్ల అనుసంధానం: శ్రీభరత్, ఎంపీ

ఈ సదస్సులో పాల్గొన్న విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, సిటీ నుంచి భోగాపురం విమానాశ్రయానికి వెళ్లడానికి ట్రాఫిక్ వల్ల చాలా సమయం పడుతుందన్నారు. ఇందుకోసం 12 ఫ్లైఓవర్లు నిర్మించాలనే ప్రతిపాదన ఉందన్నారు. అయితే మెట్రో రైలు ప్రాజెక్టు కూడా ఉన్నందున ఈ రెండింటికి ఉపయోగపడేలా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేయాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారని, ఆ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారని చెప్పారు. ఎలివేటెడ్ కారిడార్‌లో మూడు చోట్ల ఫ్లైఓవర్లకు కనెక్టివిటీ ఉంటుందన్నారు. ఈ డిజైన్ కొంత క్లిష్టమైనదని అభిప్రాయపడ్డారు. విశాఖలో భూగర్భ కేబుల్ వ్యవస్థ కొంత మేరకు ఉందని, త్వరలోనే నగరం అంతా వేస్తారని, అయితే పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్‌ను ప్రతి ఒక్కరు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ వ్యయం తగ్గుతుందని సూచించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం 18 నెలల్లోనే పూర్తవుతుందని చెప్పారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

నక్కపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని ఉద్దండపురం వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గొడిచెర్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు. దీనికి సంబంధించి సీఐ కుమారస్వామి తెలిపిన వివరాలిలా వున్నాయి. నక్కపల్లి మండలం గొడిచెర్ల గ్రామానికి చెందిన ఆవాల నవీన్(19), కిల్లాడ నాగేశ్వరరావు (22), దేవవరం గ్రామానికి చెందిన దమ్ము సీతాలు స్నేహితులు. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో ముగ్గురూ కలిసి బైక్‌పై వేంపాడు నుంచి గొడిచెర్ల వెళుతున్నారు. ఉద్దండపురం వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్నది. దీంతో నవీన్, నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందారు. దేవవరం గ్రామానికి చెందిన సీతాలు గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను నక్కపల్లి ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతిచెందిన యువకులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా వుంటున్నట్టు గ్రామస్థులు చెప్పారు. ఇద్దరు యువకులు మృతిచెందడంతో గొడిచెర్ల గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ప్రమాదంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కుమారస్వామి చెప్పారు.

ప్రాణాలు తీసిన సాగునీటి వివాదం

- శ్రీరాంపురంలో రైతు దంపతులపై కత్తితో దాడి
- ఇద్దరికీ తీవ్రగాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భార్య మృతి


రామలక్ష్మి (ఫైల్ ఫొటో)

గొలుగొండ, సెప్టెంబరు 25: పాత కక్షలతోపాటు సాగునీటి విషయంలో తలెత్తిన వివాదం ఒక మహిళా రైతు ప్రాణాలు తీసింది. తన పొలంలోకి నీరు వస్తున్నదంటూ దిగువ పొలానికి చెందిన రైతు, ఎగువ పొలానికి చెందిన రైతు దంపతులపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళా రైతు మృతిచెందింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ రామారావు, స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

మండలం కేంద్రమైన గొలుగొండ పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన రుత్తల రామకృష్ణ, రామలక్ష్మి(42) దంపతులు. వీరి ఇంటికి సమీపంలోనే వ్యవసాయం భూమి వుంది. వీరి పొలానికి దిగువన చిటికెల తాతీలు పొలం వుంది. ఇరువురి మధ్య చాలా కాలం నుంచి సరిహద్దు గొడవ వుంది. అంతేకాక భారీ వర్షాలు కురిసినప్పుడు రామకృష్ణ పొలంలో నుంచి తాతీలు పొలంలోకి అధికంగా నీరు వస్తున్నది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురవడంతో పొలంలో నీరు అధికంగా చేరింది. దీంతో బుధవారం ఉదయం రామకృష్ణ దంపతులు పొలానికి వెళ్లి నీటిని బయటకు పంపే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో చిటికెల తాతీలు వచ్చి.. మీ పొలంలో నుంచి అధిక నీరు వస్తుండడంతో తన పంట దెబ్బతింటున్నదని రామకృష్ణ దంపతులతో గొడవ పడ్డాడు. ఇరువురి మధ్య మాటామాటా పెరిగి, తాతీలు తనతోపాటు తెచ్చుకున్న కత్తితో రామకృష్ణపై దాడికి దిగాడు. ఇది గమనించిన రామలక్ష్మి అడ్డుకునే యత్నం చేయగా, ఆమెపైనా కూడా దాడికి తెగబడ్డాడు. దీంతో రామలక్ష్మి చేతులకు, రామకృష్ణ తలపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను గొలుగొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో రామలక్ష్మి సాయంత్రం 4.30 సమయంలో మృతిచెందింది. రామకృష్ణ చికిత్స పొందుతున్నాడు. నిందితుడు తాతీలు పరారయ్యాడని, అతని కోసం గాలిస్తున్నామని ఎస్ఐ రామారావు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

తాండవ నదిలో యువకుడి గల్లంతు


శివమోహన్ (ఫైల్)

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 25: మండలంలో సత్యవరం గ్రామ శివారున బుధవారం ఒక యువకుడు తాండవ నది దాటుతూ ప్రమాదవశాత్తూ నీట మునిగి గల్లంతయ్యాడు. సీఐ జి.అప్పన్న అందజేసిన వివరాల మేరకు.. సత్యవరం గ్రామానికి చెందిన ఏనుగు శివమోహన్(27) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. బుధవారం తమలపాకుల సేకరణ కోసం మరో పది మందితో కలిసి తాండవ నదికి అవతల వైపున ఉన్న తోటలకు వెళ్లాడు. పనులు పూర్తయిన తరువాత నదిపై సిమెంట్ స్తంభాలతో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన వంతెన మీదుగా వస్తుండగా నదిలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరిగింది. దీంతో శివమోహన్ అదుపుతప్పి నీటిలో పడి కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. గజ ఈతగాళ్లను రప్పించి నదిలో గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. గురువారం ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పించి నదిలో గాలింపు చర్యలు చేపడతామని సీఐ అప్పన్న తెలిపారు.

మామపై దాడి కేసులో అల్లుడికి ఐదేళ్ల జైలు

చోడవరం/ బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 25: మామపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో అల్లుడికి ఐదేళ్ల కారాగార శిక్షతో పాటు, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఇ.రాజేంద్రబాబు బుధవారం తీర్పు ఇచ్చారు. కేసుకు సంబంధించి బుచ్చెయ్యపేట ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బంగారుమెట్ట గ్రామానికి చెందిన ముత్యాల నూకరాజు కుమార్తెతో అదే గ్రామానికి చెందిన సింగంపల్లి రాముతో వివాహమైంది. అదనపు కట్నం కోసం కూతురిని వేధిస్తుండడంతో నూకరాజుకు, రాముకు మధ్య గొడవ తలెత్తింది. 2021, జూలై 29న నూకరాజుపై రాము కత్తితో దాడి చేసి హతమార్చేందుకు ప్రయత్నించాడు. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో రాముకు ఐదేళ్ల కారాగార శిక్షతో పాటు, రూ.ఐదు వేల జరిమానా విధించారు. బాధితుడు నూకరాజుకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కేసును అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేచలపు వెంకటరావు వాదించారు.

భువనేశ్వర్-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక ఏసీ రైలు

విశాఖపట్నం, సెప్టెంబరు 25: దసరా, దీపావళి పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా భువనేశ్వర్, యశ్వంతపూర్‌ల మధ్య ప్రత్యేక వారాంతపు రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 02811 నంబరు గల రైలు అక్టోబరు 5 నుంచి నవంబరు 30 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజాము 1.53 గంటలకు దువ్వాడ, అర్ధరాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02812 నంబరు గల రైలు అక్టోబరు 7 నుంచి డిసెంబరు 2 వరకు ప్రతి సోమవారం ఉదయం 4.30 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఈ సర్వీసులు 16 థర్డ్ ఏసీ కోచ్‌లతో ఖుర్దారోడ్డు, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నర్సారావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, ధర్మవరం, సత్యసాయి ప్రశాంతి నిలయం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల, సెప్టెంబర్టు 25: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు ఎనిమిదో తేదీన జరగనున్న ఈ పరీక్షకు అర్హులైన వారు అక్టోబరు మూడో తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు విద్యాశాఖాధికారులను సంప్రతించాలని కోరారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

రైవాడకు 1,500 క్యూసెక్కుల వరద

- గరిష్ఠస్థాయికి చేరువలో నీటిమట్టం
- కొనసాగుతున్న ఇన్‌ఫ్లో.. నేడు గేట్లు ఎత్తివేత?


రైవాడ జలాశయం

దేవరాపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని రైవాడ జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతున్నది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, బుధవారం సమ్మెద గెడ్డ, పినకోట చల్ల గెడ్డల నుంచి 1500 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో నీటిమట్టం 113.25 మీటర్లకు చేరుకుంది. నీటిమట్టం 113.5 మీటర్లకు చేరితే స్పిల్‌వే గేట్లు ఎత్తి, అదనపు నీటిని శారదా నదిలోకి విడిచిపెడతామని డీఈఈ ఎం.సత్యంనాయుడు తెలిపారు. పరీవాహక ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా సాధ్యమైనంత వరకు రాత్రివేళల్లోనే నదిలోకి నీటిని విడుదల చేస్తామని చెప్పారు. శారదా నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని కోరారు. కాగా జిల్లాలో రైవాడ మినహా మిగిలిన అన్ని జలాశయాలు ఈ నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలతో పూర్తిగా నిండిపోయి, స్పిల్‌వే గేట్లు ఎత్తిన విషయం తెలిసిందే. రైవాడ జలాశయంలోకి ఎగువ నుంచి వరద ప్రవాహం అధికంగా వుండడంతో బుధవారం రాత్రి లేదా గురువారం ఉదయం గేట్లు ఎత్తే అవకాశం వుందని డీఈఈ చెప్పారు.

రావికమతం: మండలంలోని కల్యాణపులోవ జలాశయంలోకి వంద క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. జలాశయం ఇప్పటికే పూర్తిగా నిండడంతో రెండు గేట్లు ఎత్తి అదనపు నీటిని సర్పా నదిలోకి విడిచిపెడుతున్నట్టు ఏఈ సత్యనారాయణ దొర చెప్పారు. గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులుకాగా బుధవారం 458.8 అడుగుల వద్ద నీటిమట్టాన్ని స్థిరంగా వుంచుతూ అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం పెరిగితే మరో రెండు గేట్లు ఎత్తుతామని ఈఏ చెప్పారు. రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాలకు చెందిన చీమలపాడు, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, కొత్తకోట, కన్నంపేట, జగ్గంపేట, జె.నాయుడుపాలెం, కొమరవోలు, ఆర్.కొత్తూరు, కుసర్లపూడి, తూటిపాల, తాడపాల, కొండల అగ్రహారం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


కల్యాణపులోవ రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తి సర్పా నదిలోకి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయంలోకి 150 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా బుధవారం సాయంత్రానికి 99.9 మీటర్లకు చేరుకుంది. ప్రధాన గేట్ల నుంచి 180 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు, నదిలోకి విడిచిపెడుతున్నట్టు ఏఈ సిహెచ్.జయరాంపడాల్ తెలిపారు. అయితే నీటిమట్టం వంద మీటర్లు దాటిన తరువాత ఇన్‌ఫ్లోను బట్టి నీటిని విడుదల చేస్తామని తెలిపారు. బొడ్డేరు నది పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉధృతంగా సర్పా, వరహానదుల ప్రవాహం


గొట్టివాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరహానది

కోటవురట్ల, సెప్టెంబరు 25: అల్పపీడనం ప్రభావం కారణంగా మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలో గల సర్పా, వరహానదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మంగళవారం రాత్రి 9 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. మండలంలో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించడంతో చెరువుల్లోకి నీరు పుష్కలంగా చేరుతోంది.

సీహెచ్‌సీలో వసతులపై కలెక్టర్ ఆరా

- ఎమ్మెల్యే సుందరపుతో కలిసి ఆస్పత్రి సందర్శన
- కనీస సౌకర్యాలు లేవని చెప్పిన వైద్యులు
- పాత సీహెచ్‌సీ భవనంలో ఆస్పత్రి నిర్వహిస్తే బాగుంటుందని ఎమ్మెల్యే సూచన


సీహెచ్‌సీని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు

ఎలమంచిలి, సెప్టెంబరు 25: ఎలమంచిలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటు కోర్టు భవనాలను కలెక్టర్ విజయకృష్ణన్, స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ బుధవారం పరిశీలించారు. పట్టణంలోని తులసీనగర్‌లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.3 కోట్లతో సీహెచ్‌సీ నూతన భవనాన్ని నిర్మించి ఎన్నికల ముందు హడావిడిగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే ఈ భవనం అరకొర వసతులతో ఉండడంతో రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన కలెక్టర్‌తో కలిసి ఆస్పత్రిని సందర్శించి వసతులపై ఆరా తీశారు. ఈ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వసతులు లేవని కలెక్టర్‌కు వైద్యులు వివరించారు. ఇక్కడికి రావడానికి రహదారి సౌకర్యం కూడా లేదన్నారు. పాత సీహెచ్‌సీ భవనంలోనే ఆస్పత్రి నిర్వహిస్తే బాగుంటుందని కలెక్టర్‌కు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో పాత సీహెచ్‌సీ భవనాలను కలెక్టర్, ఎమ్మెల్యే, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ వరహాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, లవుడు లోవరాజు, పిట్టా శ్రీను, గుర్రాల శేఖర్, కొరారు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ అభివృద్ధి పనులకు శ్రీకారం

తుమ్మపాల, సెప్టెంబర్టు 25 : ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద రూ.7.5 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టినట్టు పర్యాటకశాఖ ఈఈ రమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం బొజ్జన్నకొండ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు పలువురు కేంద్ర మంత్రులు ఈ అభివృద్ధి పనులను వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని చెప్పారు. బొజ్జన్నకొండ వద్ద నిర్మించిన ధ్యానమందిరం, లేజర్ షో థియేటర్, పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి, ఎంపీడీవో కేవీ నరసింహరావు, అధికారులు పాల్గొన్నారు.

లా వర్సిటీ విద్యార్థినుల ప్రతిభ

సబ్బవరం, సెప్టెంబరు 25: ఏఐఏడీఆర్ రెండవ అంతర్జాతీయ క్రాస్ యూనివర్సిటీ మధ్యవర్తిత్వ పోటీల్లో స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థినులు తమ ప్రతిభను చాటుకున్నారు. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఆసియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ వారు నిర్వహించిన రెండవ ఏఐఏడీఆర్ ఇంటర్నేషనల్ మీడియేషన్ కాంపిటీషన్-2024లో దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ విద్యార్థినులు వినీల కొత్తపల్లి, అంకిత వర్ధిక విజేతలుగా నిలిచారని వర్సిటీ వీసీ డి.సూర్యప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా వారిని బుధవారం వర్సిటీలో ఘనంగా సత్కరించారు.

కాంగ్రెస్ నిరసన ప్రదర్శన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తుమ్మపాల, సెప్టెంబరు 25: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద ఆ పార్టీ నాయకులతో కలిసి 'థాలీ బజావో' కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలియజేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలు కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బి.కిశోర్, ఉపాధ్యక్షుడు బి.బాలమురళి, పీసీసీ సభ్యులు టి. రమణ, ఎం.కోటేశ్వరరావు, బి.భానుమూర్తియాదవ్, పడాల కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు శ్రీప్రకాష్ రూ.10 లక్షల విరాళం


చెక్కును డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు అందజేస్తున్న సీహెచ్ విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, సెప్టెంబరు 25: విజయవాడ వరద బాధితులకు సాయం చేయడం కోసం పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థలు ముఖ్యమంత్రి వరద సహాయ నిధికి రూ.10 లక్షలు విరాళం ప్రకటించింది. ఈ మేరకు విజయవాడలో మంగళవారం రాత్రి డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ కలిసి చెక్కును అందజేశారు.

పేట హైస్కూల్ హెచ్ఎంపై డీఈవో ఆగ్రహం

- నోట్ బుక్స్ కరెక్షన్ చేయని తెలుగు ఉపాధ్యాయుడు
- పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై అసహనం
- ముగ్గురికి షోకాజ్ నోటీసులు


హెచ్ఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

పాయకరావుపేట, సెప్టెంబరు 25: విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల హెచ్ఎం, ఒక టీచర్‌తోపాటు మరొకరికి డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ బుధవారం పాయకరావుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల పుస్తకాలను తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థుల తెలుగు నోట్ బుక్స్‌ను ఉపాధ్యాయుడు శంకర్ కరెక్షన్ చేయకపోవడాన్ని గమనించారు. అతనితోపాటు హెచ్ఎం జాన్ ప్రసాద్‌పై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని తరగతుల విద్యార్థుల నోట్ బుక్‌లను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కరెక్షన్ చేసేలా చూడాలని చెప్పారు. విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో దగ్గరుండి పర్యవేక్షించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం హెచ్ఎంతోపాటు నోట్ బుక్ కరెక్షన్ చేయని తెలుగు ఉపాధ్యాయుడికి, పరిసరాలు పరిశుభ్రంగా వుంచని కుమారికి షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఆమె వెంట ఎంఈఓలు గాంధీ, రమేశ్ వున్నారు.

బకాయిలు రూ.36 లక్షలు ఇప్పించండి


స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కళాకారులు

నర్సీపట్నం, సెప్టెంబరు 25: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017-18లో గ్రామ దర్శిని, జన్మభూమి కార్యక్రమాల్లో కళాజాత నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా కళాకారులకు ఇవ్వాల్సిన రూ.36 లక్షలు బకాయిలను ఇప్పించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడును కళాకారుల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వ పథకాలపై కళాజాత నిర్వహించకపోవడంతో ఉపాధి కోల్పోయామని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారాలకు ఇక్కడ కళాకారులకు అవకాశం ఇవ్వాలని కోరారు. అయ్యన్నపాత్రుడు స్పందించి త్వరలో కళాజాత బకాయిలు విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారుల జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, కార్యదర్శి వి.దివాకర్ పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ 'ఓపెన్' ప్రవేశాలకు గడువు పొడిగింపు

తుమ్మపాల, సెప్టెంబర్టు 25: ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 28వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్య రుసుము రూ.200లు చెల్లించి ఈ నెల 30వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థులు ఫీజులను ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించుకోవచ్చునని తెలిపారు. విద్యను మధ్యలో ఆపేసిన గృహిణులు, వ్యాపారులు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా సుధీర్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్‌గా వి.సుధీర్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన విశాఖ జిల్లా నుంచి బదిలీ అయ్యారు. విశాఖ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఆర్.ప్రసాద్ నియమితులయ్యారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా బాపట్లలో సెబ్ ఏసీగా పనిచేసిన సీహెచ్ మహేష్‌కుమార్‌ను నియమించింది. ప్రస్తుతం జోన్-1 సెబ్ డీసీగా పనిచేస్తున్న డి.శ్రీరామ్మూర్తిని సెబ్ నుంచి రిలీవ్ చేస్తూ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా పూర్తి బాధ్యతలు అప్పగించింది.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

'ఇది మంచి ప్రభుత్వం'లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు

మన్యంలో చురుగ్గా కార్యక్రమం



పాడేరులో 'ఇది మంచి ప్రభుత్వం' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బొర్రా నాగరాజు, నాయకులు

పాడేరు రూరల్/ముంచంగిపుట్టు/అనంతగిరి/హుకుంపేట, సెప్టెంబరు 25: కూటమి ప్రభుత్వ పాలనతోనే గిరిజన ప్రాంత అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొర్రా నాగరాజు అన్నారు. మన్యంలో పాడేరు, ముంచంగిపుట్టు, అనంతగిరి, హుకుంపేట మండలాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం చురుగ్గా నిర్వహించారు. పాడేరులోని వంట్లమామిడి పంచాయతీ కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నాగరాజు మాట్లాడుతూ పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించకపోయినా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మన్యం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ముంచంగిపుట్టు మండలం కించాయిపుట్టు పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆదివాసీల అభ్యున్నతి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజుల్లోనే పలు అభివృద్ధి కార్యక్రమాలను చేయడంతో పాటు అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయమన్నారు. అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తామన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి గోడలకు 'ఇది మన ప్రభుత్వం' స్టిక్కర్లను అతికించారు. అనంతగిరి మండలంలోని కొండిబలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పున్నమ్మ వంద రోజుల పాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

హుకుంపేట మండలంలోని రాప పంచాయతీ లివిటి గ్రామంలో టీడీపీ నేత శంకర్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ప్రతీ ఇంటికి వెళ్లి 100 రోజులకే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న, త్వరలో అమలు చేయనున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు కిట్లంగి పద్మ, జిల్లా అధికార ప్రతినిధి దివ్య, పాడేరు, ముంచంగిపుట్టు, అనంతగిరి, హుకుంపేట మండలాల కూటమి నాయకులు తోకల ఈశ్వరరావు, పాంగి రాంబాబు, పామర్తి కొండమ్మ, యడ్ల అప్పారావు, భారతి, వి.లక్ష్మణ్, ఎస్.సుభాష్, గడ్డంగి రామ్మూర్తి, కె.బలరాం, ఎస్.బాబూజీరావు, వి.రామస్వామి, ముకుందపడాల్, చిరంజీవి, ఎం.చిన్నిబాబు, ప్రకాష్, బి.గోపాల్, పి.జగన్‌బాబు, ఎస్.దొన్ను, ఎన్.దయానిధి, కె.రాజు, సోమరాజు, పి.బాబీ, పి.భీమన్న, సిహెచ్.మురళీ, పి.రవీంద్ర, జి.రమేష్, పి.రామన్న, గంగరాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సూపర్ సిక్స్ అమలు చేయాలని కాంగ్రెస్ ధర్నా

పాడేరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా చేశారు. కలెక్టరేట్ ముందు బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ అధ్యక్షుడు సతకా బుల్లిబాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలు చేయాలని పాలకుల చెవుల్లో మారుమోగేలా శబ్దాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కంచాలపై గరిటెలతో శబ్దాలు చేస్తూ నిరసనను తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శెట్టి గంగాధరస్వామి, పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనా ఏదీ?

▸▸ దుప్పులవాడ పంచాయతీ గిరిజనులు ఆవేదన



నష్టం అంచనా వేయడానికి అధికారులు రాలేదని చెబుతున్న గిరిజనులు

సీలేరు, సెప్టెంబరు 25: గూడెంకొత్తవీధి మండలంలోని దుప్పులవాడ పంచాయతీ పరిధిలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి నష్టాలను అంచనా వేయడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వలసపల్లి, మునసపల్లి, వలసగెడ్డకొత్తూరు, శాండికోరి తదితర గ్రామాల్లో ఈ నెల 8వ తేదీన కురిసిన భారీ వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రెండు వారాలు దాటిపోయినా పంట నష్టాలను అంచనా వేయడానికి అధికారులు రాలేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమ గ్రామాలు గూడెంకొత్తవీధి మండలం పరిధిలోనే ఉన్నాయా? లేదా? అనే అనుమానం కలుగుతున్నదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించేలా చూడాలని వారు వేడుకుంటున్నారు.

ట్రైకార్ బోర్డు సభ్యుడికి బీజేపీ నేతల సన్మానం



ట్రైకార్ సభ్యుడు కృష్ణారావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పాడేరు రూరల్, సెప్టెంబరు 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ బోర్డు సభ్యుడిగా నియమితులైన బీజేపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కూడా కృష్ణారావును పార్టీ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ అధిష్ఠానం తనను గుర్తించి నామినేటెడ్ పదవి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, అల్లూరి జిల్లా కూటమి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన యువత ఆర్థికాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, నాయకులు కురసా ఉమామహేశ్వరరావు, ఎస్.మేమణబాబు, కె.వెంకటరమణ, ఎల్.అబ్బాయిదొర, సల్లా రామకృష్ణ, ఎం.శాంతకుమారి, పెనుమాక రవికుమార్, ఆర్.పాపిటిరాజు, ఎం.గోపాలపాత్రుడు, పి.రవిచంద్ర, ఎన్.ఉమామహేష్ పాల్గొన్నారు.

గరికిబంద-గరిమండ రోడ్డుకు మోక్షం

▸▸ ఐటీడీఏ పీవో చొరవతో మరమ్మతులు ▸▸ 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



గరికిబంద-గరిమండ రహదారి మరమ్మతు చేసిన దృశ్యం

కొయ్యూరు, సెప్టెంబరు 25: గరికిబంద-గరిమండ రహదారికి మోక్షం లభించింది. ఐటీడీఏ పీవో చొరవతో రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో సుమారు 15 గ్రామాలకు రవాణా కష్టాలు తీరాయి. ఈ రహదారి అసంపూర్తిగా నిలిచిపోవడంతో పాటు సెల్ టవర్ కేబుల్ వేసేందుకు తీసిన గోతులతో అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయమైంది. దీంతో సుమారు 15 గ్రామాల ప్రజల రాకపోకలకు ప్రశ్నార్థకంగా మారాయి. ఈ విషయాన్ని కొద్ది రోజుల క్రితం 'బురదమయంగా రహదారి-ప్రయాణికులు అవస్థలు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికితోడు బూదరాళ్ల సర్పంచ్ ముత్యాలమ్మ పాడేరులో జరిగిన మీ కోసం కార్యక్రమంలో సమస్యను పీవో దృష్టికి తీసువెళ్లారు. ఈ మేరకు పీవో స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణకు సహకరించాలి

▸▸ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా



లంబసింగి పీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

చింతపల్లి, సెప్టెంబరు 25: మాతాశిశు మరణాల నియంత్రణకు సహకరించాలనిజిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ జమాల్ బాషా కోరారు. మండలంలోని లంబసింగి పీహెచ్‌సీని బుధవారం సందర్శించారు. వైద్యులు సమ్మెలో ఉండడంతో రోగులకు ఆయనే పరీక్షలు చేశారు. అనంతరం కిల్తారిలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవం పొందితే మాతాశిశు మరణాలను నియంత్రించవచ్చునన్నారు. గర్భిణులు వైద్యుల సూచన మేరకు చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలని, దీనివల్ల బిడ్డ ఎదుగుదల తెలుస్తుందని చెప్పారు. గర్భిణులు ప్రసవ సమయానికి పది రోజులు ముందు ఆస్పత్రిలో చేరాలన్నారు. వైద్యులు సమ్మెలో ఉండడంతో స్టాఫ్ నర్సులు, సిబ్బంది రోగులకు అన్ని వేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పారా మెడికల్ ఉద్యోగులు గ్రామాల్లో వ్యాధులు ప్రబలిన వెంటనే ప్రాథమిక చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో మురళి పాల్గొన్నారు.

కుష్ఠుపై అప్రమత్తంగా ఉండాలి: జేడీ దేవసాగర్

కుష్ఠు వ్యాధిపై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని అమరావతి లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ సూచించారు. తాజంగి పీహెచ్‌సీని బుధవారం సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. స్పర్శ నొప్పి లేని మచ్చ కుష్ఠు కావచ్చునన్నారు. ప్రజల్లో ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. వ్యాధి నిర్ధారణ జరిగితే అధైర్యపడొద్దని, మంచి చికిత్స అందుబాటులో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, ట్రైబల్ నోడల్ అధికారి రమేశ్ పాల్గొన్నారు.

నేడు అండర్-14, 17 రెజ్లింగ్ ఎంపికలు

కొయ్యూరు, సెప్టెంబరు 25: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో గురువారం అండర్-14, 17 బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్టు కొయ్యూరు రెజ్లింగ్ అకాడమీ కోచ్ అంబటి నూకరాజు తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని రెజ్లింగ్‌లో ప్రతిభ గల క్రీడాకారులను ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తీసుకురావాలని కోరారు.

వాటర్ డిస్పెన్సర్ వితరణ

చింతపల్లి, సెప్టెంబరు 25: తాజంగి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం పూర్వ విద్యార్థి వ్యక్తిగత నిధులతో వాటర్ డిస్పెన్సర్ విరాళంగా ఇచ్చారు. బుధవారం పాఠశాలను సందర్శించిన పూర్వ విద్యార్థి నూకరాజు ఉపాధ్యాయులకు దీన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారామ్, నాయకుడు ఉగ్రంగి లక్ష్మణరావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శెట్టి మోహన్‌రావు, వర్తక సంఘం నాయకులు పెబ్బులి సత్తిబాబు, నానిబాబు పాల్గొన్నారు.

దీన్ దయాల్ ఆశయ సాధనకు కృషి

పాడేరు రూరల్, సెప్టెంబరు 25: పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయ సాధనకు కృషి చేయాలని గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు కోరారు. కొత్తపాడేరులోని గిరిజన మోర్చా కార్యాలయంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి దీన్ దయాల్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కురసా రాజారావు, ఎస్.రామకృష్ణ, ఎం.గోపాలపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

భీంపోల్ అంగన్‌వాడీ కేంద్రం తనిఖీలు

అనంతగిరి, సెప్టెంబరు 25: భీంపోల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏసీడీపీవో అచ్యుతంబ బుధవారం తనిఖీ చేశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అనంతరం టీడబ్ల్యూ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. అలాగే స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. సర్పంచ్ భీమ్మలమ్మ, వైస్ సర్పంచ్ అప్పలకొండ, టీడీపీ నాయకులు ఎ.జానకీరామ్, పి.సింహాచలం, ఎం.కన్నయ్య, జే.సింహాద్రి, వీ.ఈశ్వరరావు, ఎమ్.సింహాద్రి పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందాం

... 5వ పేజీ తరువాయి

ఇచ్చిన నిధులతో సజావుగా ప్లాంటు నడిపితే ఫర్వాలేదని..రెండు, మూడేళ్ల తరువాత నిధుల సమస్య మళ్లీ మొదటకు వస్తే అప్పుడు పరిస్థితి ఏమిటని మరికొందరు సందేహం వ్యక్తంచేశారు. కర్మాగార యాజమాన్యం ఒంటెత్తు పోకడలు, కార్మికుల్లో కొందరి ప్రవర్తనపై కూడా ప్రజల్లో అపోహలు ఉన్నాయని కొందరు అన్నారు. అందువల్ల పటిష్ఠమైన యాజమాన్యం ఉండాలని అభిప్రాయపడ్డారు. కేంద్ర పరిధిలో ఉన్న భూములు మొత్తం బదిలీ చేస్తే బ్యాంకులు నుంచి రుణం తీసుకుని కర్మాగారానికి నడుపుకోవచ్చునని సమావేశంలో ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. ఏదోవిధంగా కర్మాగారాన్ని నిలబెట్టుకోవాలని, సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు నివేదిక రూపంలో సమర్పించాలని తీర్మానించారు. చంద్రబాబు ద్వారా కేంద్రంతో చర్చించి ఒక నిర్ణయం తీసుకోవాలని, అందుకు కాలయాపన కాకుండా సత్వరమే చర్యలు ఉండాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ విశాఖపై తనకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. పాదయాత్ర సమయంలో ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చానని గుర్తుచేశారు. విశాఖ ఉక్కుతో ప్రతి తెలుగువాడికి ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, హైదరాబాద్‌లో తమ ఇంటికి విశాఖ ఉక్కు స్టీల్ వాడామన్నారు. కర్మాగారాన్ని వెంటాడుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి కార్మికుల కళ్లల్లో ఆనందం చూడాలనే దృఢ సంకల్పంతో కేంద్రంతో సంప్రతింపులు జరుపుతున్నామని అన్నారు. అందరికీ ఆమోద్యమైన పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలను చంద్రబాబునాయుడుకు నివేదిస్తామన్నారు. కేంద్రంతో సీఎం చర్చించి ఉక్కు కర్మాగారంపై ఒక నిర్ణయం తీసుకుంటారని లోకేశ్ వెల్లడించారు. రానున్న రోజుల్లో మిగతా సమస్యలపై చర్చించుకుని నిర్ణయాలు తీసుకుందామన్నారు. అందరూ కూర్చుని చర్చించుకుంటే పరిష్కారం కాని సమస్య ఉండదన్నారు. సమావేశంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్, కోండ్రు మురళి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, టీడీపీ పెందుర్తి, విశాఖ దక్షిణ ఇన్‌చార్జులు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, సెయిల్ డైరెక్టర్, బీజేపీ నాయకుడు కాశీవిశ్వనాథరాజు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏజేసీ నాయకులు

అక్రమ నిర్మాణాలు తొలగించండి

▸▸ ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర

▸▸ అరకు ప్రధాన రహదారిలో భారీ ర్యాలీ

అరకులోయ, సెప్టెంబరు 25: అరకులోయలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా చేపట్టిన భవన నిర్మాణాలను తక్షణమే తొలగించాలని ఆదివాసీ జేఏసీ అల్లూరి జిల్లా కన్వీనర్ రామారావు దొర డిమాండ్ చేశారు. ఈ మేరకు అరకులోయ ప్రధాన రహదారిలో బుధవారం భారీ ర్యాలీ చేశారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయ సమీపంలోనే గిరిజనేతరుడు అక్రమంగా భవనం నిర్మిస్తున్నారని, ఈ విషయంపై మండలంలోని అన్ని శాఖల అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ వరకు అందరికీ ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో యథేచ్ఛగా భవనాలు నిర్మిస్తున్నారని, వీటిని నిరోధించాల్సిన అధికారులే గిరిజన చట్టాలను తుంగలో తొక్కి ప్రోత్సహిస్తున్నారని ఆయన ఆరోపించారు.

ఇప్పటికైనా ఐటీడీఏకు వచ్చే ఉన్నత స్థాయి అధికారులు గిరిజన చట్టాలు ఉల్లంఘన కాకుండా తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాని వారే చట్ట వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ పరిధిలోని ఆదివాసీ జేఏసీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

తయారు చేయాలన్నారు. అలాగే స్వయం సహాయక సంఘాలను పరిశ్రమ స్థాపనలో భాగస్వాములను చేయాలని కలెక్టర్ సూచించారు. అక్టోబరు 2వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలని, పరిశ్రమ నెలకొల్పడానికి అవసరమైన భూ సేకరణ పనులు పూర్తి చేయాలన్నారు. చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రైతులకు, మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. వారపు సంతల్లోనూ చిన్న, చిన్న మార్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన రూరల్ రినైసాన్స్ సంస్థ డైరెక్టర్ ప్రఖార్ ఆండ్లే మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పాటు చేసిన రూరల్ ఇండస్ట్రియల్ పార్కు గురించి పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు దోహదపడుతుందన్నారు. గ్రామీణ ఉత్పత్తి వ్యవస్థను ప్రోత్సహించే అవకాశం ఉంటుందన్నారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు రెండు ఎకరాల భూ విస్తీర్ణం ఉండాలని, రూ.2 కోట్ల మూలధనం పెట్టుబడిగా ఉండాలని, యంత్ర పరికరాలకు రూ.40 లక్షలు, శిక్షణా కార్యక్రమాలకు రూ.35 లక్షలు, సాంకేతిక సహకారానికి రూ.5 లక్షలు నిధులు అవసరం ఉంటుందని చెప్పారు. ఐదు గ్రామాలను ఒక క్లస్టరుగా చేసి ఒక గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడం వల్ల స్థానిక గిరిజనుల ఆర్థిక సాధికారతకు దోహదపడుతుందన్నారు. ఈ సమా వేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీవాణిధర్ రామన్, సహాయ సంచాలకుడు ఎం.నవీన్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నంద్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, పీహెచ్‌వో ఎస్.అశోక్, పీఎంయూ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాంగోపాల్, పశు వైద్యాధికారి రాజా కిషోర్ పాల్గొన్నారు.

28న హౌసింగ్ పథకాలపై అవగాహన

జిల్లాలోని ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఈ నెల 28న హౌసింగ్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. ప్రధానంగా హౌసింగ్ స్కీమ్‌ల్లో పెండింగ్ బిల్లులతో పాటు గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను 2025 మార్చి నాటికి పూర్తి చేయాలనే విషయాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ నెల 28న ప్రతి గ్రామ సచివాలయం పరిధిలోని హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.

త్వరలో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు అటవీ అనుమతులు

... 5వ పేజీ తరువాయి

కొంత దూరంలో వెలగాల వద్ద కూడా ఒక రిజర్వు ఫారెస్టు ఉందని, అక్కడ ఎకో టూరిజానికి ఇటీవలే అనుమతులు వచ్చాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో కాశీబుగ్గ రేంజ్ కాశీబుగ్గ టౌన్‌లో ఒక నగర వనం మంజూరైం దన్నారు. అనకాపల్లి జిల్లాలో బయ్యవరం వద్ద హైవేను ఆనుకుని ఒక నగర వనాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. దీనిని శుక్రవారం ప్రారంభించనున్నామన్నారు. విశాఖపట్నంలో కూడా ఒక నగర వనం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉందని ఆయన తెలిపారు.

నర్సరీల్లో మొక్కల పెంపకం

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నర్సరీల్లో మొక్కలను పెంచి ప్రజలకు అవి అందుబాటులో ఉండేలా ప్రతిపాదనలు తీసుకొచ్చిందని, ఈ మేరకు విశాఖపట్నం సర్కిల్ పరిధిలో 75 లక్షల మొక్కలను పెంచాలని నిర్ణయించామన్నారు. ఎన్‌ఆర్‌జీఎస్ ద్వారా ఈ నర్సరీలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ఆయన వెంట ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, పంప్డ్ స్టోరేజీ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, రామభద్రరాజు(ఎస్ఈ, సివిల్) ఏడీఈ టి.అప్పలనాయుడు, డీఎఫ్‌వో సూర్యనారాయణపడాల్, తదితరులు ఉన్నారు.

☛ సంక్షిప్తంగా..



గిరిజనులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు

లోతుగెడ్డ- రాళ్లగెడ్డ రహదారి పునరుద్ధరణ

సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

చింతపల్లి, సెప్టెంబరు 25: గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ తెలిపారు. బుధవారం మండలంలోని శివారు సీపీఐ మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కుడుముసారి పంచాయతీ కొత్తగుమ్మల, కాలనీ గ్రామాలను ఆయన సందర్శించారు. గిరిజనులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు స్వయంగా పరిశీలించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు తాగునీరు, సాగునీరు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయం భవనం పూర్తి చేస్తామని చెప్పారు. పాఠశాలకు అదనపు భవనాలు మంజూరు చేస్తామన్నారు. కుడుముసారి పంచాయతీలోని గ్రామాలు కోరుకొండ పీహెచ్‌సీ పరిధిలో ఉండడం వల్ల రోగులను ఆస్పత్రికి తీసుకు వెళ్లేందుకు రహదారిలేక ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు ఆయనకు తెలిపారు. తమను లోతుగెడ్డ పీహెచ్‌సీ పరిధిలో చేర్చాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతానని ఆయన చెప్పారు. అలాగే అత్యంత అధ్వానంగా ఉన్న లోతుగెడ్డ- రాళ్లగెడ్డ ప్రధాన రహదారి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.రామకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు రూరల్, సెప్టెంబరు 25: జిల్లా కేంద్రం పాడేరులోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు చేయనున్న దృష్ట్యా గురువారం మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం.అప్పారావు తెలిపారు. పాడేరు, జి.మాడుగుల మండల కేంద్రాల్లోని సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మాత్రమే సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 25: శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ కంటా జాహ్నవి చెప్పారు. ఏబులం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తున్నది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలని చెప్పారు. వరి, రాగి పంటలను వరుసల పద్ధతిలో నాట్లు వేసుకోవాలన్నారు. ఇది కలుపు నియంత్రణ, మందుల పిచికారీకి అనువుగా ఉంటుందన్నారు. మొక్కల వద్ద పిలకలు అధికంగా వచ్చి దిగుబడి పెరుగుతుందన్నారు. ఉద్యాన పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ వివరించారు. కార్యక్రమంలో ఏవోలు మధుసూదనరావు, శోభ, ఏపీసీఎన్ఎఫ్ రాజుబాబు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



పశువులకు వ్యాధి నిరోధక టీకాలు దృశ్యం

అనంతగిరి, సెప్టెంబరు 25: పశువులు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నట్టు పశు వైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు తెలిపారు. కాశీపట్నం పంచాయతీ పరిధిలోని బంగారమ్మపేట గ్రామంలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి రైతులతో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో రైతులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాడి రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు పశు సంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో ఉమామహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలకు తెగించి ప్రయాణం

సరకులతో ఉప్పొంగుతున్న వాగు దాటిన అంగన్‌వాడీ కార్యకర్త



సరకులతో వాగు దాటుతున్న అంగన్‌వాడీ కార్యకర్త

సీలేరు, సెప్టెంబరు 25: ఎ.ధారకొండ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పూర్తి దెబ్బతింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నడుమవీధి, గొల్లపల్లి గ్రామాల మధ్యలోని వాగు వర్షాలు తగ్గుముఖం పట్టినా ఉధృతి తగ్గలేదు. దీంతో గొల్లపల్లికి చెందిన అంగన్‌వాడీ నిర్వాహకురాలు ముర్ల సీతమ్మ బుధవారం సరకును సిరిబాల గ్రామం నుంచి కాలినడకను పది కిలోమీటర్లు నడుచుకుంటూ ఉధృతంగా ప్రవహిస్తోన్న నడుమవీధి, గొల్లపల్లి మధ్య గల వాగును ప్రాణాలకు తెగించి దాటింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మారుమూల గ్రామాలకు వాగులపైన వంతెన నిర్మించాలని తెలుగు యువత అధ్యక్షుడు ఎం.కోటేశ్వరావు తెలిపారు.